క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

తంగళ్లపల్లి: మండెపల్లి ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్(ఐటీడీఆర్)లో ప్రత్యేకంగా పది రోజుల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దురై మురుగన్ ఒక ప్రకటనలో తెలిపారు. రుసుముతో కూడిన శిక్షణలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ నైపుణ్యాలు వివరిస్తారని, హాస్టల్, భోజన వసతి కల్పించి శిక్షణ అనంతరం సర్టిఫికెట్ జారీ చేస్తామన్నారు.

ఫ్లెక్సీ చించివేతపై ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న నాయకులు

వేములవాడ: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని పాపన్నచౌక్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చించివేసిన ఘటనపై నాయకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు. నాయకులు పిన్నింటి హన్మండ్లు, బిల్ల కృష్ణ, గుడిసె మనోజ్, రేగుల రాజ్‌కుమార్, నేరెళ్ల సాయి, కీసర యశ్వంత్, కోలా మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి


బద్దెనపల్లి ప్రభుత్వ పాఠశాల ఎదుట బైఠాయించిన నాయకులు

తంగళ్లపల్లి: ప్రభుత్వ పాఠశాలలో మైనర్ బాలికలను వెకిలి చేష్టలతో వేధిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు కోరారు. బద్దెనపల్లి ప్రభుత్వ పాఠశాల ఎదుట శుక్రవారం బీజేపీ నాయకులు బైఠాయించారు. శ్రీధర్‌రావు మాట్లాడుతూ.. పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సై ఉపేంద్రచారి నాయకులను అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. ఎంఈవో, డీఈవోను వివరణ కోరగా.. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సైని వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

డబుల్ బెడ్‌రూం ప్లాట్ ఆక్రమణ

తంగళ్లపల్లి: ఇందిరమ్మకాలనీ పంచాయతీ పరిధిలోని కేసీఆర్‌నగర్‌లో ఎటువంటి అనుమతుల్లేకుండా ఓ వ్యక్తి డబుల్ బెడ్‌రూం ప్లాట్‌ను ఆక్రమించాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. కేసీఆర్‌నగర్‌కాలనీలోని 32వ బ్లాక్‌లో 12 డబుల్ బెడ్‌రూంలుండగా.. వాటిలో 10 లబ్ధిదారులకు పట్టాలిచ్చారన్నారు. మిగిలిన రెండింటిలో ఒకదాన్ని తాత్కాలిక అంగన్వాడీ కేంద్రానికి కేటాయించారని.. మిగిలిన ఒక్క ప్లాట్‌ను కూరపాటి నరేశ్ అనే వ్యక్తి అక్రమంగా తాళాలు పగలగొట్టి ఆక్రమించుకున్నాడని అన్నారు. అతడు అంతర్ జిల్లా దొంగగా ముద్ర పడి దొంగతనాలు వృత్తిగా కొనసాగిస్తూ అసాంఘిక శక్తిగా మారాడని తెలిపారు. అతన్ని ఖాళీ చేయించి చట్టపరమైన చర్యలు తీసుకొని కాలనీవాసులకు న్యాయం చేయాలని, భయాందోళనలు దూరం చేయాలని కోరుతున్నారు.

స్పోర్ట్స్ డ్రెస్సులు వితరణ



సిరిసిల్లటౌన్: ప్రభుత్వ బడిలో చదివే విద్యార్థులకు సిరిసిల్లకు చెందిన గుండేటి శిరీష-వేణు దంపతులు స్పోర్ట్స్ డ్రెస్సులు వితరణ చేశారు. శుక్రవారం స్థానిక గీతానగర్‌లోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి చేతుల మీదుగా 110 మందికి అందజేశారు.

సన్మానం



ఇల్లంతకుంట: పెద్ద లింగాపురం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయున్ని శుక్రవారం పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. పాఠశాలలో నాగవెల్లి వేణు విధులు నిర్వర్తిస్తూ 317 స్పౌజ్ బదిలీల్లో వీణవంక మండలం హిమ్మత్‌నగర్‌కు బదిలీపై వెళ్లారు. హెచ్‌ఎం గుర్రం సందీప్‌రెడ్డి, సునీత, లలిత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

చందుర్తి: గ్రామ పంచాయతీ కార్మికులకు 3 మాసాలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, లేకుంటే ఈనెల 24 నుంచి రాష్ట్రవ్యాప్త సమ్మెకు దిగుతామంటూ ఎంపీడీవో ఎల్.రాధ, ఎంపీవో ప్రదీప్‌కుమార్‌కు పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా నాయకుడు మల్యాల నర్సయ్య ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రాన్ని సమర్పించారు.


ఇది సిరిసిల్ల పట్టణంలోని గణేశ్‌నగర్. ఇది పూర్తిగా కార్మిక క్షేత్రం. ఇక్కడ పేదలు, నేత, బీడీ కార్మికులు నివాసముంటారు. 2 దశాబ్దాల కిందటే గణేశ్‌నగర్ విస్తరించినా.. రోడ్ల నిర్మాణాలు జరగలేదు. సిరిసిల్ల మున్సిపల్ 21వ వార్డులోని రోడ్లన్నీ మట్టి రోడ్లు కావడంతో పూర్తిగా బురదమయంగా మారాయి. ప్రధాన రోడ్డును సిమెంట్ రోడ్డుగా మార్చగా.. అంతర్గత రోడ్లు మాత్రం ఇలా అధ్వానంగా ఉన్నాయి.


ఇది సిరిసిల్ల పట్టణ శివారులోని జయప్రకాశ్‌నగర్. ఇది కూడా కార్మిక క్షేత్రమే. ఇక్కడ ప్రధాన రోడ్లు సైతం మురికి కూపంగా ఉన్నాయి. జేపీనగర్ నుంచి రాజీవ్‌నగర్‌కు వెళ్లే రోడ్లు మట్టి రోడ్లు కావడంతో ఇటీవల వర్షాలకు రోడ్డు పూర్తిగా చెడిపోయింది. నల్లరేగడి నేలలు కావడంతో ఇక్కడి రోడ్డు బురదమయంగా మారింది. ఆ రోడ్డుపై వాహనాలపై కాదు కదా.. కాలినడకకు సైతం వీల్లేకుండా పాడైపోయి ఉన్నాయి.

కార్మిక వాడలు.. నిర్లక్ష్యపు జాడలు

- సిరిసిల్ల.. బురదే నిలువెల్లా..
- ఈ పట్టణం కంటే పల్లెలే నయం
- అడుగు వేయలేం.. ఇల్లు చేరలేం..
- ఎవరికీ పట్టని శివారులు

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని కార్మిక వాడలు అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇటీవలి వర్షాలకు రోడ్లు బురదమయంగా మారాయి. ఆ రోడ్లపై అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనదారులు గమ్యం చేరడం గగనమే. కార్మిక వాడలైన బీవైనగర్, సుందరయ్యనగర్, గణేశ్‌నగర్, ఇందిరానగర్, ప్రగతినగర్, శివారు ప్రాంతాలైన రాజీవ్‌నగర్, చంద్రంపేట, జ్యోతినగర్ ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లు బురదమయంగా మారి అధ్వానంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మట్టి రోడ్లు రాకపోకలకు వీల్లేకుండా పాడయ్యాయి. నల్లా పైపుల కోసం, మిషన్ భగీరథ పైపులైన్, రోడ్డు నిర్మాణ పనుల కోసం రోడ్ల వెంట తవ్వి మట్టిని వదిలేశారు. దీంతో వర్షాలతో నల్లరేగడి మట్టి తడిసిపోయి రోడ్లు జారిపోతున్నాయి. కాళ్ల చెప్పులు కూరుకుపోయేలా రోడ్లున్నాయి. చీకటి వేళల్లో కార్మికులు ఇంటికి చేరడం చాలా కష్టంగా ఉంది. శివారు ప్రాంతాల్లోని ఏ అంతర్గత రోడ్డును చూసినా ఇదే పరిస్థితి.

తట్టెడు మొరమైనా పోయరా..

సిరిసిల్ల పట్టణంలోని రోడ్ల కంటే.. పల్లెటూరి రోడ్లు ఎంతో నయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. చెడిపోయిన రోడ్లపై తట్టెడు మొరమైనా పోయకపోవడం దారుణం. సిరిసిల్ల మున్సిపాలిటీకి కలెక్టర్ ప్రత్యేక అధికారిగా ఉన్నారు. మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి బురదమయంగా మారిన మట్టి రోడ్లను బాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పుడు బతుకమ్మ, దసరా పండుగల సీజన్ కావడంతో.. చెడిపోయిన రోడ్లతో జనం ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే ప్రత్యేక నిధులు కేటాయించి పండుగల నేపథ్యంలో పట్టణంలో బురదమయంగా మారిన అంతర్గత రోడ్లను బాగు చేసేందుకు కనీసం మొరం పోయాలని కార్మికులు కోరుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


ఇది సిరిసిల్ల పట్టణ శివారులోని రాజీవ్‌నగర్. అత్యధికంగా పేదలు, కార్మికులు నివాసముండే రాజీవ్‌నగర్‌లోని చిన్న బోనాల, ముష్టిపల్లి రోడ్లు బాగుండగా.. అంతర్గత రోడ్లు ఇటీవలి వర్షాలకు పూర్తిగా చెడిపోయాయి. నల్లరేగడి నేల కావడంతో నీరు నిలిచి వాహనాలు వెళ్లడానికి వీల్లేకుండా రోడ్లున్నాయి. గతంలో కొన్ని రోడ్లను సిమెంట్ రోడ్లుగా మార్చగా.. ఇలాంటి చాలా రోడ్లు ఇంకా మిగిలే ఉన్నాయి.


ఇది సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్ ప్రధాన రోడ్డు. సంపన్నులు నివాసముండే విద్యానగర్ ప్రధాన రోడ్డు గుంతలు పడి.. వర్షం నీటితో నిండి.. వాహనాల రాకపోకలకు ప్రతిబంధకంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణిస్తే వాహనాలు ఉయ్యాలా.. జంపాలా అన్నట్లుగా ఊగాలిందే. వర్షం పడితే చాలు.. ఇలా గుంతల్లో నీరు నిండి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ప్రముఖులు నివాసముండే విద్యానగర్‌లోనే రోడ్ల పరిస్థితి ఇలా ఉంటే.. ఇక మిగిలిన రోడ్ల పరిస్థితి చెప్పక్కర్లేదు.


వీర్నపల్లి: మండల కేంద్రం నుంచి ఎల్లారెడ్డిపేట వెళ్లే ప్రధాన రహదారిపై రోడ్డుకిరువైపులున్న చెట్ల కొమ్మలు రోడ్డుపైకి రావడంతో వాహనదారులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల వీర్నపల్లి–కంచర్ల మధ్య చెట్ల కొమ్మలు అడ్డు ఉండడంతో.. మలుపు వద్ద ఎదురుగా వస్తున్న బస్సు వీర్నపల్లికి చెందిన యువకున్ని ఢీకొనడంతో ప్రాణాపాయం తప్పి ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలైపోతున్నాయని మండలవాసులు వాపోతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626


శ్రమదానం చేస్తున్న నాయకులు

మౌలిక వసతులు కాపాడుకుందాం

సిరిసిల్లటౌన్: ప్రజలు చెల్లించిన పన్నులతో ఏర్పాటు చేసుకున్న మౌలిక వసతులను కాపాడుకునే బాధ్యత పౌర సమాజంపై ఉందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. శుక్రవారం బీజేపీ పట్టణ శాఖ నిర్వహించిన సేవాపక్షంలో భాగంగా శ్రీనగర్‌కాలనీ రోడ్డు చౌరస్తాలో శ్రమదానం నిర్వహించి మాట్లాడారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, జిల్లా కార్యదర్శి కర్నే హరీశ్, మహిళా మోర్చా నాయకురాలు వేముల వైశాలి, పండుగ మాధవి, పట్టణ ఉపాధ్యక్షులు మోర శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న నాయకులు

వేములవాడఅర్బన్: బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో సేవాపక్షం స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నాయకులు గుర్రవానిపల్లి గ్రామంలోని శ్రీహనుమాన్ దేవాలయం ఎదుట స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. పిచ్చి మొక్కలు తొలగించారు. మొక్కలు నాటారు. చింతపల్లి వెంకటేశ్వరరావు, మోహన్ రావు, జింక అనిల్, అంజన్న, లక్ష్మణ్, శంకర్, మహేశ్, నర్సయ్య తదితరులున్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు.


సీఐటీయూలో చేరిన నాయకులు, సభ్యులు

సీఐటీయూలో చేరిక

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్ల విద్యుత్ సహకార సంస్థ సెస్‌లో పని చేస్తున్న కార్మికులకు 2018లో అసిస్టెంట్ హెల్పర్‌గా, 2020లో ప్రొఫెషన్ పీరియడ్ డిక్లేర్ ఇచ్చారని, అసిస్టెంట్ హెల్పర్ల నుంచి హెల్పర్లుగా వెంటనే ప్రమోషన్ ఇవ్వాలని స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.గోవర్ధన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కల్యాణలక్ష్మి గార్డెన్‌లో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ అనుబంధ యూనియన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కర్నాల అనిల్‌కుమార్ అధ్యక్షతన వంద మందికి పైగా చేరారన్నారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ఎస్ఎండీకి వినతిపత్రం అందజేశారు. స్టేట్ జనరల్ సెక్రటరీ నలువాల స్వామి, రాష్ట్ర యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సింగిరెడ్డి చంద్రారెడ్డి, యూనియన్ జిల్లా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ ప్రజావేదిక


ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

కోనరావుపేట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు మండలంలోని 28 గ్రామాల్లో జరిగిన పనులు, పంచాయతీరాజ్(ఇంజనీరింగ్ విభాగం) ద్వారా చేపట్టిన సీసీ రోడ్లు, ఇతర భవన నిర్మాణాల పనుల కోసం కూలీల ఖర్చు రూ.4.94 కోట్లు, సామగ్రి రూ.42లక్షలు, మెటీరియల్ ఖర్చు రూ.2.51కోట్లు కలిపి మొత్తం రూ.7.46కోట్ల విలువ గల పనుల వివరాలను ప్రస్తావించారు. ఉపాధి పనుల్లో రూ.42,440, పంచాయతీరాజ్ పనుల్లో రూ.50,051 కలిపి మొత్తం రూ.92,491 నిధుల రికవరీకి అధికారులు ఆదేశించారు. ప్రిసైడింగ్ అధికారిగా డీఆర్డీవో బి.శేషాద్రి, ఎంపీడీవో జి.శంకర్‌రెడ్డి, ఏపీవో శ్రీనివాస్, సోషల్ ఆడిట్ విజిలెన్స్ అధికారి బి.రామారావు, ఏపీఎం అరుణ్‌కుమార్, ఎంపీవో ఆరీఫ్, పంచాయతీరాజ్ ఏఈ అంజయ్య, ఎస్ఆర్పీ సాంబశివాచారి, ఈసీ, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధిద్దాం


మాట్లాడుతున్న ఎంఈవో రాజిరెడ్డి

ముస్తాబాద్: గ్రామాల్లో సంపూర్ణ అక్షరాస్యత సాధనకు అందరూ కృషి చేయాలని ఎంఈవో నిమ్మ రాజిరెడ్డి కోరారు. మండల వనరుల కేంద్రంలో నవ భారత సాక్షరత కార్యక్రమంపై వీవోఏలకు శిక్షణ తరగతులను శుక్రవారం నిర్వహించారు. ఆర్పీలు రాజన్న, వినీల, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్‌పీలున్నారు.

వీర్నపల్లి: దేశవ్యాప్తంగా సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు రూపొందించిన ఉల్లాస్ కార్యక్రమం విజయవంతం చేయడంలో టీచర్లు, గ్రామైక్య సంఘాలదే ప్రధాన పాత్రని మండల అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ సుదర్శన్ అన్నారు. శుక్రవారం మండల వనరుల కేంద్రంలో టీచర్లు, వీవోఏలకు ఏర్పాటు చేసిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్, ఆర్పీలు కూలేరి ప్రేమ్‌సాగర్, మునీందర్ తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: వయోజనులను విద్యావంతులను చేయడానికి ఉల్లాస్ శిక్షణ ఉపయోగపడుతుందని ఎంఈవో శ్రవణ్‌కుమార్ అన్నారు. ఎమ్మార్సీ భవనంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సెర్ప్ వీవోఏ ఉద్యోగులతో శుక్రవారం శిక్షణ సమావేశం నిర్వహించారు. ప్రోగ్రాం రిసోర్స్‌పర్సన్స్ గంగాధర కనకయ్య, సురేందర్ స్వామి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు భూమయ్య, బొలగం శ్రీనివాస్, ఉషారాణి తదితరులున్నారు.

చందుర్తి: సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు ఉల్లాస్ కార్యక్రమం తోడ్పడుతుందని మండల విద్యాధికారి వినయ్‌కుమార్ అన్నారు. చందుర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వీవోలు, ప్రాథమిక పాఠశాల ప్రధానోధ్యాయులకు ఉల్లాస్ శిక్షణ తరగతులను శుక్రవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎడ్ల కిషన్, గడప రఘుపతిరావు, జలెందర్ రెడ్డి, మధుసూదన్, రమేశ్, కాపిల్ల నరేశ్ పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారమందించాలి


ప్రతిజ్ఞ చేయిస్తున్న సుశ్మిత

తంగళ్లపల్లి: నేరెళ్ల–1 అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశ్మిత ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు జంక్ ఫుడ్ తగ్గించాలని, నూనె, ఉప్పు, చక్కెర వాడకాన్ని తగ్గించాలని, కేవలం పౌష్టికాహారం మాత్రమే అందించాలని తల్లులకు సూచించారు. ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం ప్రభాకర్, అంగన్వాడీ టీచర్ పద్మ, పిల్లలు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: పెద్ద లింగాపురం అంగన్వాడీ సెక్టార్ పరిధిలోని రామాజీపేట అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్వాడీ కేంద్ర పిల్లల తల్లిదండ్రులకు ఆహార వంటకాల పోటీలు, పోషక ఆహార ప్రతిజ్ఞ చేయించారు. పెద్ద లింగాపురం అంగన్వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ సూర్యకళ మాట్లాడుతూ.. ఈనెల 17 నుంచి అక్టోబర్ 16 వరకు పోషణ మాసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంగన్వాడీ టీచర్ అంజలి, ఆశ కార్యకర్త సంతోష, గ్రామస్తులు పాల్గొన్నారు.

చందుర్తి: ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటుకే పోషణ్ మాసోత్సవాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. మర్రిగడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, ఆయా రజిత, తల్లులు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులతో సంతోష్


వేడుకల్లో విద్యార్థినులు

ముందస్తు బతుకమ్మ వేడుకలు

వేములవాడ: విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి స్కూల్ ఆవరణలో బతుకమ్మలను పేర్చి దాండియా ఆడారు. బతుకమ్మ పాటలకు కోలాటాలు, నృత్యాలు చేస్తూ ఎంతో సంతోషంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులు చక్కగా వివరించారు. హంసిని, కృష్ణవేణి పాఠశాలల కరస్పాండెంట్లు నరాల సంతోష్, ఎస్‌వీకే, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వన మహోత్సవం


మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వేములవాడఅర్బన్: అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, శకుంతల, శారద, శోభారాణి తదితరులున్నారు.

నియామకం

వేములవాడఅర్బన్: అనుపురం గ్రామానికి చెందిన బేడ బుడగ జంగం కుల సంఘం కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈర్నల వెంకటేశం, ఉపాధ్యక్షుడిగా వినీత్, క్యాషియర్‌గా వెంకటేశం, కార్యదర్శిగా నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా దేవయ్య, సభ్యులుగా శంభు, సత్యం, గంగారం ఎన్నికయ్యారు.

మున్నూరు కాపు సత్తా చాటుదాం



గంభీరావుపేట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరు కాపు కులస్తుల సత్తా చాటాలని మండల అధ్యక్షుడు మేకార్తి భిక్షపతి, రాష్ట్ర నాయకుడు కామిరిశెట్టి లక్ష్మణ్ కోరారు. మండల మున్నూరు కాపు సంఘం ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది.

నగదు జమ చేయండి

వేములవాడరూరల్: మత్స్యకారులకు ప్రభుత్వం ఇచ్చే ఉచిత చేపపిల్లల పథకాన్ని రద్దు చేసి.. మత్స్య సొసైటీలలో నగదు జమ చేయాలని జిల్లా ఫిషరీస్ డైరెక్టర్ యామ తిరుపతి కోరారు. వేములవాడలో శుక్రవారం మాట్లాడుతూ.. చేపపిల్లల పంపిణీలో అవినీతితో నాణ్యత లోపించి ఆలస్యంగా పెరుగుతున్నాయన్నారు.

మాజీ కౌన్సిలర్ మృతి


రాధ(ఫైల్)

సిరిసిల్లటౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న సిరిసిల్లకు చెందిన మాజీ కౌన్సిలర్ తుమ్మ రాధ(75) శుక్రవారం కన్నుమూశారు. బీవైనగర్‌కు చెందిన కమ్యూనిస్టు నాయకుడు, దివంగత మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ సతీమణి రాధ రెండుసార్లు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆమె 31వ వార్డు నుంచి బీఆర్ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్‌గా ఉన్నారు. సుదీర్ఘ రాజకీయ నేపథ్యం, భార్యాభర్తలు ఇద్దరు కౌన్సిలర్లుగా ప్రజాసేవకు అంకితమయ్యారు. నిరుపేదరికంలో ఉంటూ..ఖరీదైన వైద్యం చేయించుకోలేని స్థితిలో రాధ మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. ఆమె మృతిపై బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చక్రపాణి తదితరులు సంతాపం ప్రకటించారు.

కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

వేములవాడ: విప్ ఆది శ్రీనివాస్ బీసీ కాబట్టి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో అవమానించారని బీసీ సంఘాల నాయకులు మండిపడ్డారు. కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక మున్నూరు కాపు సంఘం వద్ద బీసీ సంఘాల ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఏఎస్పీ శేషాద్రినిరెడ్డికి ఫిర్యాదు చేశారు.

సిరిసిల్లటౌన్: విప్‌ను అవమానపరిచిన కలెక్టర్‌ను సస్పెండ్ చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు కోరారు.

కారును తగలబెట్టిన దుండగులు

కోనరావుపేట: ధర్మారంలో ఓ యువకుడి కారును గుర్తుతెలియని వ్యక్తులు తగలబెట్టారు. గ్రామానికి చెందిన లోకిని ప్రశాంత్ అనే యువకుడు కారును కొనుగోలు చేసి కిరాయికి నడుపుకుంటూ ఉపాధిని పొందుతున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు కారుకు నిప్పంటించారు. కారులో అలారం మోగడంతో వెంటనే బయటకొచ్చి మంటలార్పారు.


మాట్లాడుతున్న వై.శ్రీనివాస్


నృత్యం చేస్తున్న విద్యార్థులు

స్వాగతోత్సవం

వీర్నపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు రెండో సంవత్సరం విద్యార్థులు స్వాగత ఉత్సవ కార్యక్రమం ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి వై.శ్రీనివాస్ మాట్లాడుతూ.. బాల్యం నుంచే లక్ష్యాన్ని ఏర్పర్చుకోవాలన్నారు.

ముస్తాబాద్: మోడల్ స్కూల్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఇంటర్ మొదటి సంవత్సరం, ఆరోతరగతిలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు స్వాగతం పలికారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, ఎస్సై గణేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.